



పాదయాత్రలో పాల్గొన్న నాయకుల, ఆయా కాలనీల వాసులు

మనుషుల ప్రాణాలు పట్టవా..?

పాదయాత్రలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

మనుషుల ప్రాణాలు పాలకులకు, అధికారులకు పట్టవా అని సిపిఎం నాయకులు ప్రశ్నించారు. డంపింగ్ యార్డ్ ను తొలగించాలని కోరుతూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో రెండవ రోజు పాదయాత్ర రాజీవ్ కాలనీ పంచాయతీలోని పలు కాలనీలలో కొనసాగింది. లెక్చరర్ కాలనీ నుండి ప్రారంభమైన పాదయాత్రకు లెక్చరర్స్ కాలనీ ప్రెసిడెంట్ కిష్టప్ప, ఉపాధ్యక్షులు సురేష్, కాలనీవాసులు కృష్ణారెడ్డి, టివీ రెడ్డి, రమేష్ రెడ్డి తదితరులు మద్దతు తెలిపారు. సిపిఎం చేస్తున్న ఈ కార్యక్రమం విజయవంతం కావాలన్నారు. ఎంతోమంది ప్రాణాలకు హాని కలిగించే విషపు గాలి, దుర్వాసన, కలుషితమైన వాతావరణం నుండి కాపాడాలని సిపిఎం చేస్తున్న పోరాటం విజయం సాధించాలన్నారు. ఈ పాదయాత్ర భగత్ సింగ్ నగర్, నేతాజీ నగర్, ముత్యాలమ్మ కాలనీ, సత్య సాయి నగర్, ప్రియాంక నగర్, మహాదేవ నగర్, గణే నాయక్ నగర్‌లో కొనసాగింది. ఎక్కడికి వెళ్ళినా డంపింగ్ యార్డ్ ఆయా కాలనీల ప్రజలు పాదయాత్రకు తమ సంపూర్ణ మద్దతు పలికారు. సమస్య చాలా తీవ్రంగా ఉందనిఈ డంపింగ్ యార్డ్ తొలగించే వరకు తామందరం కలిసి వస్తామని చెప్పారు. ఈ సందర్భంగా 39 ఛానల్ హనుమంత్ రెడ్డి పాదయాత్రలో పాల్గొని మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాల కంటే డంపింగ్ యార్డే నాయకులకు ఇష్టంగా తయారైందని విమర్శించారు. ఆపదలు వచ్చినప్పుడు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే ప్రభుత్వాలు ఇంతమంది ప్రాణాలకు ఇబ్బంది కలిగిన డంపింగ్ యార్డ్‌ను తొలగించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదని వాపోయారు. తాను కూడా చాలాసార్లు అధికారులకు విన్నవించిన ఫలితం లేకుండా పోయిందని చెప్పారు. శుక్రవారం జరిగిన పాదయాత్రలో వైసీపీ సర్పంచి ఆషాభి, సిపిఎం న్యూ డెమోక్రసీ నాయకులు వీర నారప్ప, మాజీ సర్పంచి హుస్సేన్, రాజీవ్ కాలనీ టిడిపి నాయకులు రసూల్ తదితరులు పాల్గొని పాదయాత్రకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ముర్తుజ, రాజీవ్ గాంధీ ఉపసర్పంచి మసూద్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, ఇర్ఫాన్, నగర కమిటీ సభ్యులు ఎన్టీఆర్ సీన, రాజు, వెంకటేష్, గఫూర్, లతీఫ్ రాజీవ్ కాలనీవాసులు డేవిడ్, నూరుల్లా, శీన, రాము, లాలు షేక్షా, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవాకు ఇచ్చారు.. హెచ్ఎల్‌సికి మరిచారు...



ఎస్కేయు, జెఎన్‌టియుకి గతమంతే..
ఉమ్మడి అనంత జిల్లాకు నిరాశే
విపక్ష, వామపక్షాల పెదవివిరుపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో గతం కంటే నిధుల కేటాయింపులు కొంత వరకు పెరిగాయి. హంద్రీనీవాకు కేటాయింపులు పెంచినప్పటికీ, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు ఆశించినంత కేటాయింపులు పెరగలేదు. బడ్జెట్‌పై విపక్షాలు పెదవి విరుస్తుండగా, అధికార పార్టీ నేతలు మాత్రం మెరుగ్గా ఉందని కితాబునిచ్చారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రెండవసారి అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో కేటాయింపులు ఈ విధంగానున్నాయి.

హంద్రీనీవాకు పెరుగుదల

హంద్రీనీవా ప్రాజెక్టు 2025-26 బడ్జెట్‌లో గతం కంటే పెరుగుదల జరిగింది. రెండు దశలకు కలిపి బడ్జెట్‌లో రూ.3446.51 కోట్లు కేటాయించారు. అంతక మునుపు ఏడాది అంటే 2024-25లో రూ.2014.24 కోట్లు కేటాయించి రూ.1765.24 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఈసారి దాన్ని పెంచినప్పటికీ ఇందులో వెయ్యి కోట్ల రూపాయల వరకు విద్యుత్ బిల్లులున్నాయి. తక్కిన వాటిల్లో సుమారు రెండు వేల కోట్ల రూపాయల వరకు నిధులు హంద్రీనీవా పనులకు కేటాయించారు. ఇందులో ఏ మేరకు ఖర్చు పెడతారన్నది చూడాల్సి ఉంది. ఇకపోతే జిల్లాలోనున్న మరో ప్రధాన ప్రాజెక్టు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు రెండు దశలకు కలిపి రూ.70 కోట్ల వరకు కేటాయించారు. ఇందులో సాధారణమైన వాటికి పోనూ అభివృద్ధి పనులకు కేటాయింపులు మొక్కుబడిగానే ఉన్నాయి. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి దయనీయంగా ఉన్న విషయం తెలిసిందే. ఆధునీకరణ చేపట్టాలన్న డిమాండ్ సర్వత్రా ఉంది. కాని నిధులు ఈ ప్రాజెక్టుకు పెద్దగా కేటాయింపులు జరగలేదు.

విశ్వవిద్యాలయాలకు పెరగలేదు.

జిల్లాలో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం జెఎన్‌టియులున్నాయి. వీటికి గత ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు జరిపినంతనే ఈసారి జరిపారు. అంతకు మునుపు ఏడాది రూ.100.13 కోట్లు కేటాయిస్తే ఈసారి అంతే కేటాయించారు. అనంతపురం జెఎన్‌టియుకి రూ.58.7 కోట్లకుగానూ ఈసారి అంతే కేటాయించారు.


అప్పులభారం మోపే విధంగా ఉంది



ఇచ్చిన హామీలు మరచి అప్పుల భారాన్ని ప్రజలపై మోపే విధంగా ఉంది బడ్జెట్. లక్ష కోట్లు అప్పులు చేయాలని నిర్ణయించడాన్ని బట్టి చూస్తే ప్రజలపై భారాన్ని మోపేందుకు సిద్ధమైనట్లు కనిపిస్తోంది.అనంతపురం జిల్లాకు సాగునీటి రంగానికి కొంత ప్రాధాన్యతనిచ్చినట్లు కనిపిస్తున్నా అందులో నిధులు వెచ్చించేది ఎంత అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ఈ బడ్జెట్‌లో రూ.3446 కోట్లు కేటాయిస్తే అందులో వెయ్యి కోట్ల వరకు విద్యుత్ బిల్లులకే ఖర్చు చేయాల్సి ఉంది. ఇక తక్కిన దానిలో పనులకు ఎంత ఖర్చు చేస్తారన్నది చూడాల్సి ఉంది.

వి.రాంభూపాల్,
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

సూపర్ సిక్స్‌కు చిల్లు



సూపర్ సిక్స్‌కు ఈ బడ్జెట్‌లోను కూటమి ప్రభుత్వం చిల్లు పెట్టింది. హామీల అమలకు తగ్గట్టు బడ్జెట్‌లో కేటాయింపుల్లేవు. లోకేశ్‌ను పొగడటంపైనే ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఎక్కువ దృష్టి పెట్టారు. 19 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు ఇస్తామన్న రూ.1500 ప్రస్తావన లేదు. నిరుద్యోగ భృతి ఊసేలేదు. జాబ్ క్యాలెండర్ ప్రస్తావన లేదు. ఏరుదాటాక తెప్పగలేసిన చందంగా ఉంది చంద్రబాబు తీరు.

అనంత వెంకటరామిరెడ్డి,
వైసిపి జిల్లా అధ్యక్షులు

హామీలను నెరవేర్చే బడ్జెట్



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే బడ్జెట్. ఈ బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం కల్పించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిస్తూనే..పరిశ్రమలు ఇతర వాటికి బడ్జెట్లో నిధులు కేటాయించారు. పేద మధ్యతరగతి వర్గాల ఆకాంక్షకు అనుగుణంగా నిధుల కేటాయింపులు జరిగాయి. అన్నదాత సుఖీభవ తో పాటు అమ్మకు వందనం పథకానికి నిధులు కేటాయించారు. విద్య, వైద్యానికి కూడా తగిన ప్రాధాన్యమిచ్చారు.

దగ్గుపాటి ప్రసాద్
అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే

ఓబుళాపురం
గనుల్లో నిశబ్దానికి పదహారేళ్లు....



భయంకరమైన శబ్దాలు, ముడి ఖనిజంతో తరలిపోయే లారీలు, కొండలను పిండి చేసే త్యాధునిక యంత్రాలు ఇది ఒకప్పటి ఓబులాపురం గనుల మైనింగ్ పరిస్థితి. కనుచూపుమేరలు ఎక్కడ చూసినా ఎర్ర మట్టి, ముడి ఇనుప ఖనిజం తరలించే లారీలు, గూడ్స్‌ల రాకపోకలతో ఆ ప్రాంతమంతా సందడిగా ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. అంతా నిశ్శబ్దం. ఒక్కరి స్వార్థం ఎంతోమందికి శాపంగా మారింది. వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఎంతో కొంత నీతి నిబద్ధత పాటించి మైనింగ్ కార్యకలాపాలు సాగించిన కంపెనీలు కూడా గాలి జనార్దన్ రెడ్డి చేసిన అవినీతి అక్రమాలకు బలైపోయారు. ఆయన అక్రమాల కారణంగా ప్రభుత్వం గనుల తవ్వకాలను నిషేధించింది. ఇది జరిగి నేటికి 16 ఏళ్లు అయింది.

ప్రజాశక్తి - డి.హీరేహాల్

ఒకరి స్వార్థం... ఎందరికో శాపం

డి. హీరేహాల్ మండలంలో విస్తారంగా ఇనుప ఖనిజం గనులు ఉన్నాయి. ఈప్రాంతరం ఆంధ్రప్రదేశ్, కర్నాటక సరిహద్దుల్లో ఉంది. అప్పట్లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కర్నాటకలో మంత్రిగా పనిచేసిన గాలి జనార్దన్ రెడ్డి చేతులు కలిపి ప్రకృతి సంపదను నిలువునా దోచుకున్నారన్న ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గాలి జనార్దన్ రెడ్డిని సిబిఐ అరెస్టు చేసింది. జిల్లాలో ఒఎంసి 1, ఒఎం సి2, ఎజికె, అంతర్ గంగమ్మ కొండలతో పాటు బిఐఒపి, వై .మహాబలేశ్వరంపై మైనింగ్ కంపెనీల పేర్లతో గనుల్లో తవ్వకాలకు అనుమతులు పొందారు. ఇనుపముడి ఖనిజం ధర భారీగా పెరగడంతో గాలి జనార్ధనరెడ్డి నిలువు దోపిడీ చేశారని అప్పట్లో కోర్టులో పిల్ దాఖలయింది. ఈ నేపథ్యంలో సిబిఐ దర్యాప్తు ప్రారంభించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టింది. గాలి జనార్దన్ రెడ్డి తను ఈసీ పొందిన గనులతో పాటు ఇతర కంపెనీలు అనుమతి పొందిన ప్రాంతంలోనూ, అటవీ భూముల్లోనూ అక్రమంగా మైనింగ్ చేశారని, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులు, జిటి స్టేషన్ ట్రై జంక్షన్ గుర్తులను కూడా చెరిపేసి నట్లు గుర్తించారు. వీటితోపాటు సుంకులమ్మ దేవాలయాన్ని కూడా కూల్చి మేలు రకం ముడి ఇనుమును దోచుకున్నారని సిబిఐ అభియోగం మోపింది, ఇందులో భాగంగానే వైయస్సార్ మరణానంతరం ఏర్పడిన రోశయ్య ప్రభుత్వం గనుల్లో తవ్వకాలు నిషేధించింది అప్పటినుండి గనుల్లో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. మైనింగ్ కార్యకలాపాలు ఆగిపోవడంతో ఎంతోమంది కార్మికులు ఉపాధి కోల్పోయారు దీనికి తోడు ఈ ప్రాంతంలో నివసిస్తున్న గ్రామ ప్రజలు ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి పోతున్నారు. ఈనేపథ్యంలో మైనింగ్ తిరిగి వచ్చేనా అంటూ స్థానికులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

సాంకేతిక విద్యాభివృద్ధికి కృషి

జెఎన్‌టియు విసి ఆచార్య హెచ్. సుదర్శన రావు

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జె ఎన్ టి యు ద్వారా సాంకేతిక విద్యను అభివృద్ధి చేసి ఇక్కడి విద్యార్థుల కు ఉపాధి అవకాశాలు, పరిశ్రమ లు నెలకొల్పే విదంగా విద్యార్థులు తయారు చేస్తానని జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య హెచ్. సుదర్శనరావు పేర్కొన్నారు. శుక్రవారం విశ్వవిద్యాలయం ఉపకులపతి కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన ఉపకులపతిగా భాద్యతలు చేపట్టిన సందర్భంగా రిజిస్ట్రార్ ఎస్. కృష్ణయ్య, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య చెన్నా రెడ్డి అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ చెన్నారెడ్డి మాట్లాడుతూ ఉపకులపతి ఆచార్య హెచ్. సుదర్శన రావు నిబద్ధత కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన యూనివర్సిటీని ఉన్నత పథంలో నడిపిస్తారని ఆకాంక్షించారు. అనంతరం విసి హెచ్. సుదర్శన రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తనపై నమ్మకం ఉంచి ఈ ఉపకులపతి బాధ్యతను అప్పగించిందని, ఈ భాద్యతను సక్రమంగా నిర్వహిస్తానని, అందరికి అన్ని విధాలుగా అందుబాటులో ఉండి విద్యాభివృద్ధికి కృషి చేస్తానని, యూనివర్సిటీ ని ఉన్నత స్థాయి కి తీసుకెళతానని తెలిపారు. అనంతరం ఆచార్య హెచ్. సుదర్శన రావుని అటానమస్ కళాశాలల ప్రిన్సిపల్స్, రిజిస్ట్రార్ అధ్వరంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓస్డటూ వీసీ ఆచార్య ఎన్. దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు, అటానమస్ కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.



విసికి శుభాకాంక్షలు చెబుతున్న అధికారులు

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - అనంతపురం సిటీ



వివరాలు వెల్లడిస్తున్న ఆర్ఐఒ వెంకటరమణనాయక్

ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆర్ఐఒ వెంకటరమణనాయక్ తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబందించి శనివారం నుండి ప్రారంభమవుతుండగా జిల్లా వ్యాప్తంగా 63 పరీక్షా కేంద్రాలలో మొదటి సంవత్సరం 25730 మంది, రెండవ సంవత్సరం 22960 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు మార్చి 1వతేదీ నుండి 13 వరకు, రెండవ సంవత్సరం వారు 3 వతేదీ నుంచి 15 వరకు, ఒకేషనల్ విద్యార్థులు 20 వతేదీ వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులను పరీక్షా కేంద్రానికి అర్ధగంట ముందుగా అనుమతిస్తామన్నారు. 900మంది ఇన్విజిలేటర్ల ఏర్పాటు చేశామన్నారు. వీరికి శుక్రవారం ఓరియంటేషన్ పోగ్రాం కూడా నిర్వహించామన్నారు. అలాగే పర్యవేక్సించడానికి మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఫ్లైయింగ్ స్క్వాడ్‌లోనూ ఎఎస్ఐ, డిప్యూటీ తహశీల్దార్, ఒక సీనియర్ లెక్చరర్ వుంటారన్నారు. జిల్లా కేంద్రం లోని ఆర్ఐఒ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు గానీ వారి తల్లిదండ్రులకు గానీ ఏవైనా అనుమానాలుంటే ఆ కంట్రోల్ రూమ్ లోని 08554-277626 నంబర్ కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు.

ఎఫ్ఎసి ఇఇగా బిఎల్ నరసింహ

అనంతపురం కార్పొరేషన్ :



నరసింహకు అభినందనలు తెలుపుతున్న కారొప్రరేషన్ సిబ్బంది

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎఫ్ఎసిగా బిఎల్ నరసింహకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇన్‌ఛార్జి ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ మరియన్న శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాధాకృష్ణ పదవీ విరమణ చేయడంతో పరిపాలన సౌలభ్యం నిమిత్తం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ సిఫారసు మేరకు డిఇఇ బిఎల్ నరసింహకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా అదనంగా బాధ్యతలు అప్పగించారు. ఆయన నియామకం పట్ల కాంట్రాక్టర్లు, సమోద్యోగులు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. అరంతరం సిబ్బంది పూల బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

'స్మార్ట్' మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో ప్రజలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వాలు వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో పెద్దఎత్తున నిరసనలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ఏమాత్రం లెక్కజేయకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో డిస్కాంలు ప్రతిపాదించిన విధంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తప్పనిసరి చేస్తూ ఎపిఇఆర్‌సి ఇచ్చిన తీర్పును సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. క్వాజీ జ్యుడీషియల్ అథారిటీగా ఉంటూ వినియోగదారుల హక్కులను పరిరక్షించాల్సిన ఆంధ్రప్రదేశ్ అందుకు విరుద్ధంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు కేవలం కార్పొరేట్ ప్రయోజనాల కోసమే అన్నారు. ప్రజల అనుమతి లేకుండా బలవంతంగా స్మార్ట్ మీటర్లును బిగించే హక్కు రాష్ట్రానికి, ఎపిఇఆర్‌సికి లేదన్నారు. ఓవైపు ఛార్జీలు పెంచడం లేదంటూనే.. మరోవైపు ఛార్జీల పెంపుదలకు మూలంగా ఉండే స్మార్ట్ మీటర్లు బిగించడం దొడ్డి దారిన చార్జీల భారాన్ని పెంచడం అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మాతా, శిశు మరణాలను నివారించాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-అనంతపురం



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఇబి.దేవి

జిల్లాలో మాతా, శిశు మరణాలను తగ్గించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జనవరిలో జిల్లాలో జరిగిన మాతా, శి శు మరణాలపై ఆయా ప్రాంతాల వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతా, శిశు మరణాలు సంభవించినప్పుడు మరణానికి ముందు ఏ రకమైన ఇబ్బందులు ఎదురయ్యాయో కారణాలను తెలుసుకుని మరోసారి అలాంటి కారణంతో మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రసవం తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సమావేశంలో డి సిహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, స్త్రీవ్యాధి నిపుణులు ఇందిరా ప్రియదర్శిని, చిన్నపిల్లల వ్యాధి నిపుణులు డాక్టర్ ప్రత్యూషా, మత్తు మందు నిపుణులు డాక్టర్ జగదీష్, వాక్సిన్ స్టోర్ మేనేజర్ బివి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ ఒక నియంత



ధర్నాలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

ప్రశ్నించే వారికి బెదిరింపులు
కలెక్టర్ జోక్యం చేసుకోవాలి
తీరు మారకుంటే ఆందోళన
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నాగేంద్ర కుమార్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ నియంతలా వ్యవహరిస్తున్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్రకుమార్ విమర్శించారు. స్థానిక రాజకీయ అండ చూసుకొని అవినీతికి పాల్పడుతున్న మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ పై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం మాట్లాడుతూ తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ కార్మికుల పట్ల చట్ట వ్యతిరేక పద్ధతిలో ఒకనియంతగా వ్యవహరిస్తున్నారన్నారు. తమ బాధలు చెప్పుకుందామనుకుంటే కార్మికులకు అసభ్యంగా మాట్లాడడం ప్రశ్నించే వారిని రెగ్యులర్ పని కాకుండా తనకు తోచిన పనులు అప్పగించడం, లేదా పనికి రాలేదని అటెండెన్స్ వేయకపోవడం లాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. దీంతో కార్మికులు నిత్యం మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. తాడిపత్రి మున్సిపల్ కార్మికులకు స్కిల్డ్ ,సెమీ స్కిల్డ్ వేతనాలు ఇవ్వమని అడిగితే డబ్బులు ఇవ్వనందుకు కార్మికులను వేధిస్తున్నారన్నారు. తాడిపత్రి పురపాలక సంఘంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ ఇవ్వమని జీవో నెంబర్ 7 ఆధారంగా ఆడినందుకు 'మీరు ఆఫ్టాల్ కార్మికులు మీరు నన్ను అడిగేవారా' అని నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రశ్నించిన వారిని గత రెండు నెలలుగా 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న పనులు కాకుండా వారికి అలవాటు లేని పనులకు మారుస్తూ వేధింపులకు గురి చేస్తూ ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వారు పని చేసే ప్రదేశంలో మధ్యాహ్న సమయంలో భోజనం కోసం వెళితే వారు లేని సమయంలో ఫోటోలు తీసి వారిని మానసికంగా వేధించడం జరుగుతోందన్నారు. సమస్యను మున్సిపల్ రీజినల్ జాయింట్ కమిషనర్‌కు తెలియజేసిన పరిష్కారం కాలేదన్నారు. తాడిపత్రి కమిషనర్ శివరామకృష్ణ గతంలో భీమవరంలో కమిషనర్ గా పనిచేసేటప్పుడు అవినీతి నిరోధక శాఖ వారికి రూ. 60 కోట్లు పైగా పట్టు పడడం జరిగిందని దీనికి సంబంధించి ఇంకా కేసు నడుస్తూనే ఉందని అన్నారు. ప్రస్తుతం తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ గా తిరిగి వచ్చిన వెంటనే కార్మికుల పొట్ట కొట్టి అవినీతికి పాల్పడడం జరుగుతోందన్నారు. కార్మికులు డబ్బులు ఇవ్వలేదని ఆక్రోషంతో వారు చేస్తున్న పనులు కాకుండా ఇతర పనులు అప్పజెప్పడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కార్మికులు ఎవరైనా తమ హక్కులు అడిగితే ఉద్యోగాల నుండి తొలగిస్తామని బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. కలెక్టర్ స్పందించి తాడిపత్రి కమిషనర్ పై సమగ్రమైన విచారణ జరిపి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం డిఆర్ఒ మలోలాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ముత్తూజ, వెంకట నారాయణ, ఎటిఎం నాగరాజు, రామాంజనేయులు, తిరుమలేష్, మంత్రి వరలక్ష్మి, లక్ష్మీనారాయణ, టైల్స్ అండ్ కార్మిక యూనియన్ నాయకులు ఎర్రిస్వామి రెడ్డి, వీరయ్య, ఆజాంబాషా, నల్లప్పచ ఆదినారాయణ, పెన్నా తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే నూతన సిలబస్ రూపకల్పన

జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు



సమావేశంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు విశ్వవిద్యాలయ పరిధిలోని యూజీ 3, 4వ సంవత్సరాల విద్యార్థులకు మార్చి మూడో వారంలోపు నూతన సిలబస్ రూపకల్పన పూర్తి చేయాలని ఉపకులపతి హెచ్.సుదర్శనరావు బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్లను ఆదేశించారు. శుక్రవారం ఉపకులపతి కాన్ఫరెన్స్ హాలులో బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్.23 అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కరికులం 2023 సంవత్సరంలో మార్పులు చేశారన్నారు. అప్పుడు 1, 2వ సంవత్సరం సిలబస్ మాత్రమే చేశారన్నారు. ఇప్పుడు 3, 4వ సంవత్సరం సిలబస్ చేయాల్సి ఉందన్నారు. కావున మార్చి మూడవ వారంలోపు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఏపి ఎస్వి.సత్యనారాయణ, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఓఎస్‌డి వీసీ ఎస్.దేవన్న, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్లు పి.ఆర్.భానుమూర్తి, నాగప్రసాద్ నాయుడు, ఆర్.కిరణ్మయి, వి.బి.చిత్ర, టి.నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఇ, ఇఇల సేవలు అభినందనీయం

మేయర్ మహమ్మద్ వసీం



మాట్లాడుతున్న మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరపాలక సంస్థలో ఎస్ఇ భాస్కర్‌రావు, ఇఇ రాధాకృష్ణ సేవలు అభినందనీయమని మేయర్ మహమ్మద్ వసీం కొనియాడారు. భాస్కర్‌రావు, రాధాకృష్ణ పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం స్థానిక కార్పొరేషన్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు అన్నారు. అయితే వారి విధినిర్వహణలో వారు చేసిన సేవలే చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. నగర పాలక సంస్థలో ఎస్ఇ భాస్కర్ రావు,ఈఈ రాధా కృష్ణ లు అందించిన సహకారం మరువలేనిదన్నారు.వారి శేష జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ కమల్‌భూషణ్, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, నెల్లూరు కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ ఎస్ఇ మోహన్, ఇఇ షాకీర్‌హుస్సేన్, డిఇ నరసింహులు, ఆర్ఓ విజయ్‌కుమార్, అకౌంటెంట్ దేవశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉమర్ అలీషా జయంతి వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం, పిఠాపురం వారి ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని లలిత కళాపరిషత్‌లో డాక్టర్ ఉమర్ అలీషా సాహితీ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ సూఫీ వేదాంత వేత్త, కవి, సాహితీ వేత్త కవిరాజు డాక్టర్ ఉమర్ అలీషా మాతృభాష తెలుగు కాకపోయినా వారు తెలుగులో అద్భుత సాహిత్య సంపదలను సృష్టించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి ఉమర్ అలీషా, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ జెఎల్.మురళీధర్, లలిత కళాపరిషత్ కార్యదర్శి గాజుల పద్మజ, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, సీనియర్ రచయిత పతికి రమేష్‌నారాయణ, సాహితీ సమితి సభ్యులు సుంకర రమేష్, నెహ్రూ యువకేంద్రం డిడిఒ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి



రద్దు చేసిన ఆర్టీసీ వైఎల్‌ఆర్ 3 బస్సు

యల్లనూరు : తాడిపత్రి, యల్లనూరు వయా వెన్నపూసపల్లి గ్రామం మీదుగా సింహాద్రిపురం వరకూ ప్రయాణించే వైఎల్‌ఆర్ 3 బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు. ఈ సర్వీసును రద్దు చేయడంతో యల్లనూరు నుంచి తాడిపత్రిలోని పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా త్వరలో పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కావున ఆర్‌టిసి అధికారులు స్పందించి వైఎల్‌ఆర్ 3 బస్సు సర్వీసును పునరుద్ధరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై

పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

ఉరవకొండ : జిల్లావ్యాప్తంగా త్వరలో జరగనున్న ఇంటర్, పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు హాల్ టికెట్ ఉన్న ప్రతి విద్యార్థికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి హరూన్ రషీద్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే పరీక్ష కేంద్రాలను గుర్తించారని, ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఎందుకంటే గతేడాది పరీక్షల సమయంలో కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులను ఎండలో కూర్చోబెట్టి పరీక్షలు రాయించారన్నారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి కేంద్రంలో వెలుతురు, కిటికీలు బాగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్, నర్స్ లేదా డాక్టర్లను ఏర్పాటు చేయాలని కోరారు.

మున్సిపల్ కౌన్సిల్ అజెండాలు ఆమోదం

తాడిపత్రి : పట్టణంలోని పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన సాధారణ, కౌన్సిల్ అత్యవసర సమావేశంలో అజెండాలోని 41, అత్యవసర సమావేశ అజెండాలోని ఏడు అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. 28వ వార్డు కౌన్సిలర్ రాగే జ్యోతి అధ్యక్షత నిర్వహించిన సమావేశానికి ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, వైసిపి కౌన్సిలర్లు హాజరు కాలేదు. ఈ సమావేశంలో పొందు పరిచిన అంశాలన్నింటికి ఆమోదం తెలుపుతూ కౌన్సిల్ తీర్మానం చేసింది.

ఆర్డీటీ గృహాలకు ప్రారంభోత్సవం

శింగనమల : మండల పరిధిలోని నిదనవాడ గ్రామంలో ఆర్డీటీ సహకారంతో నిర్మించిన 17 గృహాలను స్పెయిన్ దేశస్థులు శుక్రవారం ప్రారంభించినట్లు కన్స్‌ట్రక్షన్ డైరెక్టర్ రాజశేఖరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిదనవాడలో ఆర్‌డిటి సహకారంతో గతంలో 80 గృహాలు నిర్మించామన్నారు. ఇప్పుడు 17 నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎటిఎల్ సుధాకర్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు కృష్ణారెడ్డి, అమర్నాథ్, వస్సూరుసాహెబ్, స్వర్ణలత, గ్రామస్తులు నారమ్మ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్‌లో ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు

బొమ్మనహాళ్ : మండలంలోని పాదర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ కేంద్రానికి కెజిబివి నుంచి 70 మంది ఇంటర్ మొదటి సంవత్సరం, 255 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలు రాయితీని సద్వినియోగం చేసుకోండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారిణి మౌనిక

రాయదుర్గం రూరల్ : ఉద్యానశాఖ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ రైతులకు కల్పిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారిణి మౌనిక సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని 74 ఉడేగోళం గ్రామంలో ఎస్సీ, ఎస్టీలకు ఉద్యాన శాఖ అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు, రాయితీ వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త యుగంధర్, ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి : కెవిపిఎస్



వినతిపత్రం అందజేస్తున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

శ్మశానాల్లో గుంతలు తవ్వడంతోపాటు మృతదేహాలను పూడ్చుడం, కాల్చే కాటికాపరుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రమాదేవికి కెవిపిఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ డివిజన్ కార్యదర్శి జగ్గలి రమేష్ మాట్లాడుతూ శ్మశానాల్లో గుంతలు తవ్వి మృతదేహాలను పూడ్చి, కాల్చే కాటికాపురుల వృత్తిలో జీవిస్తూ అనేక సమస్యలతో అల్లాడుతున్నారన్నారు. ఈ వృత్తిదారులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి జీవన భద్రత లేకుండా ఉందన్నారు. అలాంటి దుర్భర జీవితాలు అనుభవిస్తున్న వీరిని 4వ తరగతి ఉద్యోగులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. అలాగే వృద్ధులకు రూ.8వేల పింఛన్, రెండెకరాల భూమి ఇవ్వాలని, గ్రామాల్లో మూడు సెంట్ల నివాస స్థలం, పట్టణంలో రెండు సెంట్లు స్థలం ఇచ్చి పక్కాగృహాలు నిర్మించాలన్నారు. ఉచిత ఆరోగ్య భీమా కల్పించాలని, గడ్డపార, చిలకపారతో పాటు చేతి తొడుగులు, బూట్లు, శానిటేషన్ కిట్లు మంజూరు చేయాలన్నారు. వీరి పిల్లలకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాలని డిమాండ్ చేశారు. ఇకపోతే శ్మశానాలు కబ్జాకు గురికాకుండా ప్రహరీలు నిర్మించాలని, జీవో 1235 ప్రకారం దళితవాడలకు రెండెకరాల శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ ఆయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి రాముడునాయక్, నాయకులు మంజునాథ్, విశ్వనాథ్, సూరి, మోహన్, విక్రమ్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధే లక్ష్యంగా పనులు

డ్వామా పీడీ సలీంబాషా



ఫారంపాండ్‌ను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

ప్రజాశక్తి-అనంతపురం

వలసలు వెళ్లకుండా ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తున్నట్లు డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. శుక్రవారం స్థానిక కదిరిదేవరపల్లి జీపీలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గోకులం షెడ్లతోపాటు ఫారంపాండ్ పనులను పరిశీలించారు. శుక్రవారం కళ్యాణదుర్గం మండలం పాలవాయి జీపీ, గరుడాపురం గ్రామ పంచాయతీల్లో ఫారంపాండ్ పనులతోపాటు కంబదూరు మండలంలోని డబ్ల్యూఐడీ కదిరిదేవరపల్లి హబ్, ములకనూరు జీపీలో హార్టికల్చర్ ప్లాంటేషన్, ఫారంపాండ్ మార్కింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కల్పన లక్ష్యంగా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు తీసుకెళ్లాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రధానంగా వెనుకబాటు కారణాలను గుర్తించి అధిగమించే దిశగా పనులు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం క్లస్టర్ అసిస్టెంట్ పీడీ రమేష్‌నాయక్, కళ్యాణదుర్గం ఎపిఒ పుష్పావతి, కంబదూరు ఎపిఒ సుజాత, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్



ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, కాలనీవాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

స్థానిక సిఐటియు కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ డిఎఇ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు కాలనీలో 25 ఏళ్ల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీకి చెందిన పేదలు ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే కాలనీలో పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా అందించడంలో సంబంధిత అధికారులు విఫలం చెందారన్నారు. గతేడాది కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ఇంత వరకూ తీగలు లాగలేదన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోవడంతో 20 ఇళ్లలోని టీవీలు, ఫ్యాన్లు, కూలర్లు వంటి విద్యుత్తు ఉపకరణాలు కాలిపోతున్నాయన్నారు.కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సిఐటియు కాలనీలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఎడిఇ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు జగ్గిలి రమేష్, రంగమ్మ, పట్టణ నాయకులు రామునాయక్, ఓబులేసు, అబ్దుల్లా, సూరి, కాలనీ నాయకులు రాము, ఈరన్న, షాకీరా, భాగ్యమ్మ, ఖాదర్, శివయ్య, రవి, డేనియల్, నాగరాజు, విక్రమ్, కాలనీవాసులు పాల్గొన్నారు.



శుభ్రం చేస్తున్న కార్మికులు

ఆర్టీసీ ఖాళీస్థలాల్లో చెత్త తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన...

అనంతపురం సిటీ : నగరంలోని ఆర్టీసీ సంస్థ మైదానంలో పేరుకుపోయిన చెత్త, చెదారాలను అధికారులు శుక్రవారం తొలగించారు. ఆర్టీసీ మైదానంలో అపరిశుభ్రతపై ఫిబ్రవరి 16, 27వతేదీల్లో ప్రజాశక్తి దినపత్రికలో కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఆర్టీసీ జోనల్ ఛైర్మన్, డిఎం నాగభూపాల్ మైదానాన్ని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఆర్టీసీ సంస్థ మైదానాలను పరిశుభ్రంగా ఉంచేందుకు శాశ్వతమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే చుట్టుపక్కల ఉన్న వాణిజ్య సముదాయాల యాజమాన్యాలు, యాజమానులు ఆర్టీసీ సంస్థ స్థలాల్లో వ్యర్థాలను వేయకుండా సహకరించాలని కోరారు.

షెడ్లు పరిశీలన

యల్లనూరు : మండల పరిధిలోని బొప్పేపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన చెత్త సేకరణ షెడ్లను తాడిపత్రి ఎంపిడిఒ ఫాజుల్‌బాషా శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఎంఆర్‌సి సిబ్బంది గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్‌కు సన్మానం

యాడికి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన నాగరత్నమ్మను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేశ్వర్, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సిహెచ్ఒ జుబేదా, పిహెచ్ఎన్ వెంకటలక్ష్మి, రామ్‌ప్రసాద్‌గౌడ్, ఎల్‌డి కంప్యూటర్ సరితాదేవి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహన

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో తహశీల్దార్ శేషారెడ్డి ఆధ్వర్యంలో రీసర్వేపై విఆర్ఓలకు శుక్రవారం అవగాహన నిర్వహించారు. ఇందులో భాగంగా రీసర్వే ఏ విధంగా చేయాలి.. గ్రామకంఠం, ప్రభుత్వ భూమి, వంకలు, వాగులు ఎలా గుర్తించాలి, పట్టా భూములు ఎలా రీసర్వే చేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిటి మల్లేష్‌ప్రసాద్, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు..

ఉరవకొండ : పెళ్లీడు వచ్చిన తర్వాతనే ప్రతి ఒక్కరికీ వివాహం చేయాలని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వెంకటేష్ నాయక్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రాకెట్ల తండాలో బాల్యవివాహాలు, వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు వయస్సు వచ్చిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. అనంతరం వేసవిలో వడదెబ్బ తగలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, ఎంపిహెచ్ఎస్ శేఖర్, ఎఎన్ఎం పద్మావతి, కుమారీబాయి, ఎంపిహెచ్ఎ ముకుందర్ పాల్గొన్నారు.

మందులు పంపిణీ

బెలుగుప్ప : మండల కేంద్రం నుంచి శుక్రవారం మండలంలోని వివిధ రైతు సేవాకేంద్రాలకు పశువులకు సెలైన్లు, నట్టల నివారణ మందులు, టాబ్లెట్లుర, వ్యాక్సిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ నేటి నుంచి మండల వ్యాప్తంగా గాలుకుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బహుమతులు ప్రదానం

బొమ్మనహాళ్ : మండలంలోని గోవిందవాడ గ్రామంలో రంగనాథస్వామి రథోత్సవం సందర్భంగా నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీల విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన భక్తులకు ఆలయం తరపున ఉచిత ప్రసాదం ఏర్పాటు చేసినట్లు టిడిపి నాయకుడు సోమనాథ్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్‌కుమార్, మాజీ సర్పంచి దేవేంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్

అనంతపురం సిటీ : అర్బన్ బ్యాంకు ఛైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జెఎల్ మురళీధర్‌ఆధ్వర్యంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు ఎంసెట్, నీట్, పదో తరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ, ఆర్డీటీ, ఐఐఐటి వంటి కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. పేద బాలికలకు ఉచితంగా హాస్టల్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు నగరంలోని 3వరోడ్డులో జిఆర్ ఫంక్షన్ హాల్ ఎదురుగా శేఖర్ కోచింగ్ సెంటర్‌లోగానీ, సెల్.. 94400 45441 నెంబర్‌నుగానీ సంప్రదించాలని కోరారు.

ఉద్యోగ విరమణ పొందిన ఎంఇఒకు సన్మానం

పెద్దపప్పూరు : ఉద్యోగ విరమణ పొందిన మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవిని శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 ఓబుళపతి, ఉప విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు, ఎంపిడిఒ శకుంతలమ్మ, తహశీల్దార్ బాలాజీరాజు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు వేలం

రాయదుర్గం : రాయదుర్గం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలకు జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి బి.రామమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వేలంపాట నిర్వహించారు. వేలం ద్వారా రూ.4,38,429 ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ మహేష్‌కుమార్, జయనాథ్‌రెడ్డి, ఎస్ఐ పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పింఛన్లు పంపిణీ

యల్లనూరు : మండలంలోని 14 సచివాలయాల పరిధిలో శనివారం పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 7 గంటల నుంచి మండల వ్యాప్తంగా సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

'ఉపాధి' కల్పించండి..

ఎపిఒను నిలదీసిన కూలీ



అధికారులను నిలదీస్తున్న కూలీ వెంకటసుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్లూరు

ఉపాధి హామీ పథకం కింద పని కల్పించాలని రెండు వారాల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోరా..? అంటూ ఎపిఒ నరేంద్రను మండల పరిధిలోని చింతలపల్లికి చెందిన చెందిన కూలీ నిలదీశారు. చింతలపల్లికి చెందిన కూలీ వెంకట సుదర్శన్‌రెడ్డి శుక్రవారం శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎపిఒకు కలిసి వాపోయాడు. తనకు పని కల్పించాలని అనేకమార్లు అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని వాపోరారు. ఇదేమని అడిగితే సింగిల్ జాబ్‌కార్డు ఉన్నవారికి పనులు కల్పించమని చెబుతున్నారని చెబుతున్నారన్నారు. మిగతా పంచాయతీల్లో సింగిల్ జాబ్‌కార్డు ఉన్నవారికి పనులు కల్పిస్తున్నారని, తనకెందుకు కల్పించరని వాపోయాడు. దీంతో ఎపిఒ సమాధానం చెప్పకుండా కార్యాలయం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనకు పని కల్పించాలని వెంకట సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

వ్యవసాయం, సాగునీటి వనరులకు నిధులు పెంచాలి

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో 4 శాతం నిధులు మాత్రమే కేటాయించడం.. వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపులు చేయడంపై ప్రభుత్వం నిర్లక్ష్యం కనిపిస్తోందని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. జిల్లాలో మిర్చి, పప్పు శనగ, కందులు, జొన్నలు, మొక్కజొన్న, టమోటా, పత్తి ధరలు పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ధరల స్థిరీకరణ నిధికి రూ.3 వేల కోట్లు కేటాయించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తుంటే రూ.300 కోట్లు మాత్రమే కేటాయించడం, వ్యవసాయ యాంత్రికరణ సబ్సిడీ పథకానికి నిధులు కేటాయింపు లేకపోవడం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఆదుకోవడానికి నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. జిల్లాలో సాగునీటి అవసరాలకు తగ్గట్టుగా ఖర్చులు లేవన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి సాగునీటి రంగానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు.




శ్రమజీవులకు చోటు ఇవ్వని బడ్జెట్ : సిఐటియు

2025-26 బడ్జెట్‌లో జీతాల కోసం పని చేస్తున్న కార్మికులకు బడ్జెట్‌లో చోటు ఇవ్వలేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ అన్నారు. ఎలాంటి జీఓ ఇవ్వకుండానే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేసిన ఘనత తమదేనని చెప్పుకోవడం గడ్డి చూపించి గుర్రాన్ని పరిగెత్తించడంతో సమానమన్నారు. ఆశావర్కర్ల జీతాల పెంపునకు ఎలాంటి ప్రస్తావన చేయలేదన్నారు. హమాలీ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయలేదు. భవన నిర్మాణ బోర్డును తిరిగి పునరుద్ధరిస్తామని చెప్పినప్పటికీ దాని ప్రస్తావన బడ్జెట్ ప్రసంగంలో లేదన్నారు. వీటితోపాటు కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలుకు నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు.



మహిళలకు కేటాయింపులేవీ..? : మాజీ మంత్రి శైలజానాథ్

అనంతపురం : రాష్ట్ర బడ్జెట్‌లో మహిళలకు కేటాయింపులపై స్పష్టత లేదని మాజీమంత్రి శైలజానాథ్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో మాజీ ఎంపి రంగయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రతినెలా మహిళలకు రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చి బడ్జెట్లో స్పష్టత ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఎపికి అప్పులే పుట్టవని గతంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని మంత్రి చెబుతూనే రూ.70వేలకోట్ల అప్పులు తెస్తామని పేర్కొన్నారని గుర్తు చేశారు. ఇప్పటికే తెచ్చిన రూ.80వేలకోట్ల అప్పుల డబ్బులు ఎక్కడికి పోయాయో చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో జగన్ తెచ్చిన అప్పులు పేదవాళ్లకు డబ్బులు పంచారని, ప్రస్తుత ప్రభుత్వం ఏంచేసిందో చెప్పాలని ప్రశ్నించారు.



మహిళలు, నిరుద్యోగులకు అన్యాయం

అనంతపురం : రాష్ట్ర బడ్జెట్‌లో మహిళలు, నిరుద్యోగులకు అన్యాయం చేశారని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్ కేటాయింపులు అరకొరగా చేయడం బాధాకరమన్నారు. రాయలసీమకు చెందిన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ రాయలసీమలో వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయింపులు చేయకపోవడం అన్యాయమన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు మొండిచేయి

అనంతపురం : రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు మొండిచేయి చూపారని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. ఉద్యోగుల డిఎ, పిఆర్‌సి బకాయిల ఊసే లేదన్నారు. అంతేగాకుండా ఎపిజిఎల్ఐసి మెచ్యూరిటీ క్లెయిమ్స్‌కు నిధుల కేటాయింపు లేదన్నారు.



అభివృద్ధిని పరుగులు పెట్టించే బడ్జెట్ : ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

నార్పల : ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రగతిని మార్చబోతోందని అనడంలో ఏమాత్రం సందేహం లేదని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. వైసిపి అరాచక పాలనలో ఆగమ్యగోచరంగా మారిన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం దారిలో పెడుతోందన్నారు. ఓవైపు సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే.. మరోవైపు ఆగిన అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందన్నారు. ఇందుకు బడ్జెట్ కేటాయింపులే ఉదాహరణ అన్నారు. రైతే ముందు' అనే నినాదాన్ని బడ్జెట్లో కేటాయింపుల ద్వారా ఆచరణలో చూపించామన్నారు. అంతేగాకుండా అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు బడ్జెట్ కేటాయింపులు చేశారన్నారు. అలాగే ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి అద్దం పట్టేలా బడ్జెట్ ఉఉందన్నారు. వైసిపి అరాచక పాలనలో రాజధాని లేకుండా పోయిన రాష్ట్రానికి, కలల రాజధాని వస్తోందన్నారు. ఇందుకోసం అమరావతి నిర్మాణానికి ఏకంగా రూ.6వేల కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. వీటితోపాటు అన్ని రంగాలకూ సమాన ప్రాధాన్యత కల్పిస్తూ రాష్ట్రం ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేసిందన్నారు.

24, 25 తేదీల్లో సమ్మె

యుఎఫ్‌బియు యూనియన్ అధ్యక్షులు ఖాదర్‌బాషా

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్చి 24, 25వతేదీల్లో చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేద్దామని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ అధ్యక్షులు ఖాదర్‌బాషా, రీజినల్ సెక్రటరీ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఈమేరకు దేశవ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం అన్ని బ్యాంకుల్లో బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపినట్లు తెలిపారు. బ్యాంకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై 24, 25వతేదీల్లో పెద్ద ఎత్తున నిరసన తెలుపనున్నట్లు తెలిపారు. సమ్మెకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని తురకపల్లి గ్రామంలో తాగుడుకు బానిసైన శివశంకర్‌రెడ్డి (43) ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. తురకపల్లికి చెందిన శివశంకర్‌రెడ్డి తాగుడుకు బానిసయ్యాడు. ఈనేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం కుటుంబ సభ్యులు నిద్ర లేపగా లేవలేదు. దీంతో ఆందోళన చెంది వెంటనే ప్రయివేటు వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య కళావతి, కొడుకు, కూతురు ఉన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

గుత్తి : మండలంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. బుక్కరాయసముద్రం కెకె అగ్రహారం చెందిన సరస్వతి (44) గుంతకల్లు మండలం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లి అనంతరం స్వగ్రామానికి ఆటోలో వెళ్తుండగా గుత్తి మండలం శ్రీపురం గ్రామం వద్ద ఆటో బోల్తా పడి ఘటనలో సరస్వతి తీవ్రంగా గాయపడింది. గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు పోలీసులు చెప్పారు.

అనుచిత పోస్టులపై జనసేన ఫిర్యాదు

యాడికి : సోషల్ మీడియా వేదికగా జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెడుతున్న ఊరుచింతల గ్రామానికి చెందిన రేవతిపై శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో జనసేన నాయకులు ఫిర్యాదు చేశారు. రేవతి తన ఫేస్‌బుక్ వేదికగా గబ్బర్‌సింగ్ రేవతి అనే అకౌంట్‌తో పవన్‌కళ్యాణ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి పోస్టులు పెడుతూ కవన్ గౌరవానికి భంగం కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని సీఐ ఈరన్న, ఎస్ఐ రమణను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో జనసేన మండల కన్వీనర్ కోడి సునీల్‌కుమార్, ఉపాధ్యక్షులు జాకీర్, ప్రధాన కార్యదర్శులు గుండ్ల శివ, మధు ఆచారి, బాబు, రాజేష్, మల్లి, నాగభూషణం, జనసైనికులు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకెళ్తోన్న భారత్

జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల్లో జెఎన్‌టియు విసి సుదర్శన్‌రావు

ప్రజాశక్తి-అనంతపురం

శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ అభివృద్ధి వైపు దూసుకెళ్తోందని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శన్‌రావు అన్నారు. శుక్రవారం అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఇసిఇ విభాగంలో ఏర్పాటు చేసిన జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను విసి ప్రారభించారు. ముందుగా శాస్త్రవేత్త సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విసి జాతీయ సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యత, సర్ సివి రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్‌పై వివరించారు. ఆధునిక సమాజంలో శాస్త్ర సాంకేతిక విద్య ప్రాముఖ్యత, ఈ రంగాల్లో దేశ పురోభివృద్ధిపై కూలంకుషంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, పరిశ్రమ నిపుణులు సి.అర్జున్, ఈసీఈ విభాగాధిపతి జి.మమత, ఈవెంట్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, సీనియర్ ఆచార్యులు పి.రమణారెడ్డి, వి.సుమలత, ఎస్.అరుణ మస్తాని, మాజీ ప్రొఫెసర్ ఎంఎన్.గిరిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతపురం సిటీ : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని సరోజినీ రోడ్డులో ఉన్న లోటస్ కిడ్స్ ఇంటర్నేషనల్ అమెరికన్ స్కూల్లో చిన్నారులు రూపొందించిన సైన్స్ ప్రయోగాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా 'భవిష్యత్తు సైన్స్' అనే విధంగా విద్యార్థుల రూపొందించిన అనేక కళాఖండాలు ఎంతో అద్భుతంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నిర్మల ఆనంద్, ఉపాధ్యాయులు లావణ్య, జబీనా, సుమ, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలోని 3వ రోడ్డులో ఉన్న సాయివిజ్ఞాన్ పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా క్విజ్ నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన నమూనాలు పలువురిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ఎం.పి శ్రీనివాసులు, సి.కరుణాకర్‌బాబు, ప్రిన్సిపాల్ జి.లావణ్యారామ్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎజిఎం సుధాకర్‌రెడ్డి, క్లస్టర్ ప్రిన్సిపాల్ నీలిమా, ప్రిన్సిపాల్ రాధానాయుడు, వైస్ ప్రిన్సిపాళ్లు గౌసియా, పవిత్ర, వాణి, తదితరులు పాల్గొన్నారు.

గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాల జియాలజీ విభాగంలో భూ విజ్ఞాన శాస్త్ర ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఇందులో భూమి ఉద్భవం జియలాజికల్ టైమ్‌స్కేల్, వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, వాటర్ డిటెక్టర్, ఓపెన్ కాస్ట్ మైనింగ్, అండర్ గ్రౌండ్ మైనింగ్, క్లైమేట్ చేంజెస్, తదితర పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు ఐక్యూఎసి కోఆర్డినేటర్ జితేంద్ర, మ్యాథ్స్ విభాగం విభాగాధిపతి నాగ శశికళ, బోటనీ శ్రీదేవి, జువాలజీ రాజశేఖర్, జిఎల్ఎన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక కమభవన్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ విశ్వనాథ్, కోఆర్డినేటర్ రాధాకృష్ణనాయుడు, డీన్లు రిషిబాల, ముత్యాలన్న, ఎఒ రామకృష్ణ, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోర్టు రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ అనేక ప్రయోగాలను ఆకట్టుకునే విధంగా రూపొందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ తబస్సుమ్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి, ప్రిన్సిపాల్ ఎన్ఎవి.ప్రసాద్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనాథ్, అధ్యాపకులు జూలియస్ ఇసాక్‌రాజ్, ఎస్.పురుషోత్తం, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం : నగరంలోని రామచంద్రనగర్‌లో ఉన్న సెయింట్ అగస్టిన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరైన రవికాంత్ రమణ మాట్లాడుతూ ఆధునిక యుగంలో సైన్స్ ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ప్రపంచం విజ్ఞానంతో ఎంతగానో అభివృద్ధి చెందుతోందంటే నేటి పిల్లలు విజ్ఞానం ప్రదర్శించడమే ముఖ్య కారణమన్నారు. మనం చంద్రుని మీదకు వెళ్లగలుగుతున్నామంటే కేవలం సైన్స్ ద్వారానే సాధ్యమైందన్నారు. విద్య, వైద్యం ఎంత అవసరమో విజ్ఞానం కూడా అంతే ముఖ్యమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా విజ్ఞాన ప్రదర్శన జరుపుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. వీటి ద్వారా పిల్లలు మరింత తమ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సోలార్ సిస్టం, కాలుష్య రహిత నమూనాలు, చంద్రయాన్ వంటి నమూనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తోటి ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

స్థానిక శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ప్రిన్సిపల్ పుల్లయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి పుస్తకాలను చదవడం, రాయడం అలవాటుగా చేసుకోవాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ విపరీతంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ముఖ్యంగా ఎస్కెయు నుంచి అనేకమంది పరిశోధకులు దేశంలో మంచి స్థానంలో ఉన్నారన్నారు. రిజిస్టార్ రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. అనంతరం వివి పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా బయోటెక్నాలజీ ఆచార్యులు డి.మురళీధర్‌రావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నరసింహ, వర్సిటీ రెక్టార్, వెంకటనాయుడు, వర్సిటీ ఆచార్యులు రామ్‌గోపాల్, శ్రీనివాసన్ అనిత టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే స్థానిక రుద్రంపేట రోడ్డులోని పివికెకె ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్)లో హ్యూమానిటీస్, సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు అధ్యక్షతన జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు, పోస్టర్లు, ఫేస్ పెయింటింగులు అతిథులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు భౌతికశాస్త్ర ఆచార్యులు ఆర్.పద్మ సువర్ణ, కళాశాల ఛైర్మన్ పల్లె వెంకట కృష్ణకిషోర్, కళాశాల మేనేజ్‌మెంట్ రెప్రజెంటేటివ్ కె శ్రీకాంత్‌రెడ్డి, ఎఒ కె.మనోహర్‌రెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ టి.లక్ష్మీనరసప్ప, కోఆర్డినేటర్ ఎం.వాసుదేవరెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ సరస్వతీ విద్యా మందిరంలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఏర్పాటు చేసిన చిన్నారుల వైజ్ఞాన ప్రదర్శన మేళా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి, కె.రాఘవయ్య, సుబ్బారావు, వరలక్ష్మి, బదరీనాథ్, డి.వెంకటేశ్వర్లు, శివప్రసాద్, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంఘమేశ్ నగర్, గుత్తి రోడ్డులో ఉన్న మాంటిస్సోరి పాఠశాలల్లో జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వాయిస్ కంట్రోల్ రోబో, సోలార్ వాటర్‌ప్లాంటు, హైడ్రాలిక్ రాకెట్ లాంచ్, తదితర నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల కరస్పాండెంట్ సి..సుర్యనారాయణరెడ్డి, పాఠశాల కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపాళ్లు పద్మావతి, రమాదేవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులోని నవభారత్ పాఠశాలలో జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్ పోస్టర్ ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు వందకుపైగా తమ ప్రదర్శనలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిట్టూరు కృష్ణవేణి, నిట్టూరు అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్ : విద్యార్థులు విద్యతోపాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని నగర మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. నగర సమీపంలోని ఎల్ఆర్‌జీ పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలుగు తీసేందుకు సైన్స్‌ఫేర్ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. తాను కూడా అనంతపురం ఎల్ఆర్‌జీ ఉన్నత పాఠశాలలో చదువుకున్నానని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్‌భూషణ్, ప్రిన్సిపాల్ బొంతు ప్రసాద్, కరస్పాండెంట్ బాలస్వామి, ప్రధానోపాధ్యాయులు లియా, వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ రవీంద్రప్రసాద్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : దేశ అభివద్ధిలో శాస్త్రీయ దక్పథంతో కూడిన సైన్స్ పాత్ర చాలా కీలకమని ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకట నాయుడు తెలిపారు. జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో శు


జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న జెఎన్‌టియు విసి సుదర్శన్‌రావు

క్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం, జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సమతాగ్రామం రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్‌లో "శాస్త్రీయ దక్పథం-విద్యార్థులలో అవగాహన" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ప్రారంభంలో జనాభాకు సరిపడా ఆహార ధాన్యాలు ఉండేవి కాదని, శాస్త్రవేత్త స్వామినాథన్ కృషి ఫలితంగా నేడు ఆహార ధాన్యాలు సమృద్ధిగా ఉన్నాయని ఆయన కషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర నాయకులు సాకే భాస్కర్, డాక్టర్ పి.ప్రసూన, జెవివి సీనియర్ నాయకులు రాజమోహన్, శ్రీనివాసులు, గాంగే నాయక్, నారాయణప్ప, నగర కమిటీ సభ్యులు రాంరెడ్డి, రామకష్ణ, ప్రసాద్ రెడ్డి,లక్ష్మీనారాయణ,జంగం శ్రీనివాసులు, ప్రసాద్, రఘు, రాధాస్కూల్ కరస్పాండెంట్ ఎం.శ్రీదేవి, ప్రిన్సిపాల్ జయచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుందుర్పి : మండలంలోని మాయదార్లపల్లి ప్రాథమికొన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ క్యాక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నల్లపల్లి విజయ్‌భాస్కర్, ఉపాధ్యాయులు లింగారెడ్డి, సరోజ, మైలారప్ప, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో ఎజిఎం సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం సైన్స్ ఎక్స్‌పో-2025 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శరణ్, పిఎస్ఎస్. కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ ఫిలీప్‌కుమార్, డీన్ తిప్పారెడ్డి, ప్రైమరీ ఇన్‌ఛార్జి లీలావతి, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి హేమలత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉరవకొండ : వజ్రకరూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మోనాలిసా, స్కూల్ ఛైర్మన్ నరేష్, ఎపి మోడల్ స్కూల్ ఛైర్మన్ ఇదాయతుల్లా, పూర్వ విద్యార్థి మాన్యం అనిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : స్థానిక స్టార్ ప్యారడైజ్ హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ నాగేంద్ర, పాధ్యాయులు జ్ఞానేశ్వరి, రూప, కుమారి, మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శింగనమల : బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రోటరీపురం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ సత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్, అనంతపురం, ఫిజిక్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ దీపా సీతారామన్ వివిధ శాస్త్ర విషయాలపై విశేష సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, రంజిత్‌రెడ్డి, డైరెక్టర్ అలుమ్ని, ఇండస్ట్రీ రిలేషన్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని కెజిబివి పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఒ కమలమ్మ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో పాఠశాల అధ్యక్షులు పొరాళు ధనార్ధన, ప్రధాన ఆచార్యులు రాజేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎల్‌కెజి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల సమితి కార్యదర్శి సోమా నీలకంఠ, తుకారం, సభ్యులు గిరిధర్, ఉపాధ్యాయులు చంద్రకళ, మహాదేవి చిదానంద, విద్యార్థులు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎన్.భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : శ్రీ వెంకటేశ్వర ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ విబిఆర్.శర్మ, ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి, వైస్‌ఛైర్మన్ వెన్నెపూస రవింద్రారెడ్డి, ఎండి వెన్నెపూస రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ టి.విష్ణువర్ధన్, ఎఒ వి.వెంకట శివారెడ్డి, హెచ్అండ్ఎస్ విభాగాధిపతి డి.మధుసూదన్‌రెడ్డి, ఆర్అండ్‌డి డైరెక్టర్ రాఘవరాజు, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హరికృష్ణ, సైన్స్ ఉపాధ్యాయులు మహమ్మద్ రఫీ, ఉమాశంకర్, రామ్మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సెయింట్ అగస్టిన్ పాఠశాలలో విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న రవికాంత్‌రమణ


నవభారత్ పాఠశాలలో పాల్గొన్న విద్యార్థులు సిబ్బంది